
సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 18 । జనవరి । 2023



భూముల
చిక్కుముడులు విప్పి.. 8లో



సానుకూల దృక్పథంతో
ఉత్తమ ఫలితాలు
సినీ దర్శకుడు రాఘవేంద్రరావు 8లో



నాడు-నేడు
పనుల పరిశీలన 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏయూ తరగతులు



ఏయూ పరిపాలన భవనం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు బుధవారం నుంచి తరగతులు పునః ప్రారంభం కానున్నాయి. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల పరిధిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆన్‌లైన తరగతులు ముగించుకుని నేటి నుంచి ఆఫ్‌లైన్ తరగతులకు హాజరవుతున్నారు. దీనితో మంగళవారం నుంచి వర్సిటీలో సందడి ప్రారంభమైంది. కొంత మంది విద్యార్థులు హాస్టల్స్‌కు చేరుకుని ప్రవేశాలు పొందారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు కూడా వచ్చి వర్సిటీ పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సైన్స్ కళాశాల పరిధిలో ప్రథమ సంవత్సరంలో 1160 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. వీరిని బుధవారం నుంచి ప్రత్యక్ష తరగతులు విభాగాలలో జరుగుతాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 20 నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో బుధవారం నుంచి విశ్వవిద్యాలయ ప్రాంగణం విద్యార్థులతో సందడిగా కనిపించనుంది.

ఏఐసీఆర్‌పీఎఫ్ దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్‌గా సీతారాం



గొందు సీతారాం

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం (ఏఐసీఆర్‌పీఎఫ్) దక్షిణాది రాష్ట్రాల (ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు) కన్వీనర్‌గా గొందు సీతారాం ఎన్నికయ్యారు. గొందు సీతారాం ప్రస్తుతం ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడిగా సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం వర్చువల్ విధానంలో ఏఐసీఆర్‌పీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు దేశంలోని అన్ని జోన్లకు కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా సౌత్ జోన్ కన్వీనర్‌గా గొందు సీతారాం ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందుకున్నట్లు సీతారాం తెలిపారు. ఈ ఎన్నికకు జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ఆచార్య శాంతిసిన్హా, మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అశోక్ అగర్వాల్, అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షకులు ఆర్.వెంకటరెడ్డి, డి.ప్రకాష్‌లు సారధ్యం వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాంకు పలువురు మానవ, బాలల హక్కుల కమిషన్ల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.


గ్రూప్-2 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ

ఎంవీపీకాలనీ: అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని విశాఖ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాధరావు సూచించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఈ శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్స్‌లో విజయం సాధించేందుకు నిర్విరామం కృషి, పట్టుదల కీలకమన్నారు. సామాన్య యువతకు విద్యను చేరువచేయ్యాలనే లక్ష్యంతో అల్లూరి స్టడీ సర్కిల్ చేస్తున్న కృషిని అభినందించారు. జనవరి 20వ తేదీ నుంచి ఈ శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు 80084 12798 నంబర్‌ను సంప్రదించడం ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు.

అంతరవర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్‌లో ఏయూకు కాంస్యం



ట్రోఫీ అందుకుంటున్న ఏయూ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : ఆలిండియా అంతర వర్సిటీల మెన్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఏయూ జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్యాన్ని అందుకుంది. ఈ పోటీలు మంగళూర్ యూనివర్సిటీలో జనవరి 13నుంచి 17 వరకు జరిగాయి. ఈ సందర్భంగా జట్టును ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ తదితరులు అభినందించారు.

డుమ్మా కొడితే ఇంటికే మెసేజ్..!

- పాఠశాలల్లో యాప్ ద్వారా అటెండెన్స్
- బడికి రాకుంటే తల్లిదండ్రులకు సమాచారం
- మూడు రోజులు గైర్హాజర్ అయితే వలంటీర్ ఆరా
- హాజరు శాతం పెంపునకు దోహదం
- విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి



విశాఖ విద్య:

విశాఖ నగరంలోని ప్రకాశరావుపేటకు చెందిన రాకేష్ పొద్దున్నే ఎంచక్కా తయరై, పుస్తకాల బ్యాగు భుజాన వేసుకొని ఠంచన్‌గా బడికి బయలుదేరాడు. కానీ ఉదయం 11గంటలకు ఆ విద్యార్థి తండ్రి వెంకటరావు సెల్‌ఫోన్‌కు 'మీ బాబు ఈ రోజు స్కూల్‌కు ఆబ్‌సెంట్ అయ్యాడు' అని మెసేజ్ వచ్చింది.తమ కుమారుడు బడికి వెళ్లి చదువుకుంటున్నాడనుకున్న ఆ తల్లిదండ్రులు, ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌తో పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. రాకేష్ కాలనీ సమీపంలో తోటి మిత్రులతో ఆడుతూ కనిపించాడు. అక్కడ నుంచి బడికి తీసుకెళ్లి వదిలాడు.

స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్ హాజరు నమోదు ద్వారా సత్ఫలితాలు కనిపిస్తొన్నాయి. విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 1,397 పాఠశాలలు ఉండగా, ఇందులో 3,54,740 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ప్రతి రోజూ స్టూడెంట్ అటెండెన్స్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలలోపు పాఠశాలకు రాకుంటే తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ వెళ్లేలా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. పాఠశాలల్లో 90 శాతం హాజరు నమోదౌతుండటమే కాక, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించే అవకాశం ఏర్పడింది.

చదువులవైపు మళ్లించేలా..

విద్యార్థులందరినీ బడికి రప్పించి, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో మొబైల్ యాప్ ద్వారా హాజరు నమోదుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. చదువులకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న జగనన్న అమ్మ ఒడి పథకం లబ్ధిపొందేందుకు పాఠశాల పనిదినాల్లో 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాజరుశాతం పెంపుతో పాటు, మధ్యాహ్న భోజన పథకం పారదర్శకంగా అమలయ్యేలా స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్ హాజరు నమోదుపై విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

బడికి రాకుంటే ఇంటికే వలంటీర్

ప్రతి రోజూ ఉదయం 9.15 నుంచి 10 గంటల మధ్యలో పాఠశాలల్లో హాజరు నమోదు చేసేలా జిల్లా విద్యాశాఖాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పాఠశాల తల్లిదండ్రులు, క్లాస్ టీచర్, అదే విధంగా గ్రామ/వార్డు వలంటీరు సెల్‌ఫోన్ నంబర్‌ను చైల్డ్ ఇన్ఫోతో కూడిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్‌కు అనుసంధానం చేశారు. యాప్‌లో విద్యార్థి హాజరు నమోదు కాకుంటే వెంటనే వారి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వెళ్తొంది. వరుసగా మూడు రోజులు విద్యార్థి పాఠశాలకు గైర్హాజర్ అయినటల్లైతే సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా వలంటీర్‌కు సమాచారం వెళ్తోంది. దీంతో వలంటీరు విద్యార్థి ఇంటికి వెళ్లి , బడికి రాకపోవడానికి గల కారణాలు తెలుసుకునేలా విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ప్రతి రోజూ పర్యవేక్షణ



విద్యార్థుల హాజరు నమోదుపై ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా యాప్‌ద్వారానే హాజరువేయాలి. విద్యార్థులను చదువుల వైపు మళ్లించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేసింది. దీని వల్ల పారదర్శకత పెరుగుతుంది.

– ఎల్. చంద్రకళ,
డీఈవో, ఉమ్మడి విశాఖ జిల్లా

హాజరుశాతం పెరిగింది



స్టూడెంట్ అటెండెన్స్ యాప్ ద్వారానే విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నాం. దీని వల్ల బడికి రాని విద్యార్థులెవరనేది వెంటనే తెలుసుకునే అవకాశం కలిగింది. ఇలాంటి పర్యవేక్షణతో బడిలో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. ల్లిదండ్రులను కూడా భాగస్వామ్యులను చేయటం ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తొన్నాయి.

– బాబు, హెచ్‌ఎం,
మధురానగర్ పీఎస్, విశాఖ జిల్లా

సాయంకాలం..సాగరతీరం



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆర్కేబీచ్



ఫ్యామిలీ సెల్ఫీ



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు) : సంక్రాంతి సెలవులు కావడంతో నగరంలోని పర్యాటక ప్రాంతాలు మంగళవారం సందర్శకులతో కిటకిటలాడాయి. సంక్రాంతికి వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చేరుకున్న వారు తమ కుటుంబ సభ్యులతో పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ముఖ్యంగా ఆర్కేబీచ్, వీంఆర్‌డీఏ పార్క్, ప్రాంతాలు జనంతో కిక్కిరిసిపోయాయి. సాగరతీరంలో సిటిజనులు పతంగులు ఎగురవేసి ఆనందంగా గడిపారు. మరో వైపు బీచ్‌రోడ్డులోని టీయూ 142, కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియానికి సందర్శకులు భారీగా తరలివచ్చారు. పర్యాటక ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపికలో
గందరగోళం



దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు (ఫైల్)

- తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సుల ఆందోళన
- వెయిటేజ్ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగ నర్సుల నిరసన
- నేటికి కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ వాయిదా

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం ప్రకటించిన జాబితాపై గందరగోళం నెలకొంది. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ నిరుద్యోగ నర్సులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పోస్టుల్లో తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు నిరసన తెలిపారు. మొత్తం పోస్టులకు అభ్యర్థులను ప్రకటించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ బుధవారానికి వాయిదా పడింది.

స్టాఫ్ నర్సు పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపిక జాబితాను శనివారం వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ విడుదల చేశారు. ఈ నెల 17, 18వ తేదీల్లో కౌన్సెలింగ్ చేపట్టి.. నియామక పత్రాల జారీ చేయాలని నిర్ణయించారు. పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్ది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంత మంది నిరుద్యోగ నర్సులు, తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు మంగళవారం కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

10,659 దరఖాస్తుల స్వీకరణ

ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 10,659 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆర్డీ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించి.. మొత్తం 163 పోస్టులకు గానూ 8,659 మందిని అర్హులుగా గుర్తించారు. గత నెల 24వ తేది అర్ధరాత్రి తర్వాత వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ప్రొవిజినల్ జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించింది. మొత్తం నాలుగు వేలకు పైగా అభ్యంతరాలు రాగా.. వీటిని పరిశీలించి మెరిట్ జాబితాలో కలిపారు. ఆ తర్వాత పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం, జీవో నంబర్ 301 ప్రకారం వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. దీంతో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు కలిపి జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాపైనే గందరగోళం నెలకుంది.

నర్సుల కన్నీరుమున్నీరు

'అనకాపల్లి ఆస్పత్రిలో నాలుగున్నరేళ్ల పాటు పనిచేశా. ప్రస్తుతం చీడికాడ పీహెచ్‌సీలో తాత్కాలికంగా పనిచేస్తున్నప్పటికీ నాకు వెయిటేజ్ మార్కులు కలపలేదు. 8 నెలల గర్భిణిగా విధులు నిర్వర్తించాను. ఏడాది పాటు జీతం కూడా ఇవ్వలేదు.' అని ఓ నర్సు కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పుడు ఈ పోస్టులో అవకాశం ఇవ్వలేదని.. తనకు తీవ్ర అన్యాయం జరగడంతో స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కరోనా కాలంలో పనిచేసిన అనేక మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదని, దాని వల్ల తుది జాబితాలో పేరు లేవని పలువురు నర్సులు వాపోయారు.

సర్టిఫికెట్ల పరిశీలన

మరోవైపు స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించడానికి వైద్య ఆరోగ్యశాఖప్రాంతీయ అధికారులు సన్నాహాలు చేశారు. కానీ చాలా మంది తమకు అన్యాయం జరిగిందంటూ రావడంతో కౌన్సెలింగ్, నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేశారు. కేవలం కొందరి సర్టిఫికెట్ల పరిశీలన మాత్రమే జరిగింది.

ఏడు పోస్టుల పెండింగ్

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టుల భర్తీకి తొలుత నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత విమ్స్‌లో 24 పోస్టులు కలిశాయి. దీంతో మొత్తం 179 పోస్టులకు గానూ 172 మందితోనే జాబితా ప్రకటించారు. ఏడు పోస్టుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. దీనిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టుల్లో రెండు పోస్టులు స్పోర్ట్స్ అభ్యర్థులకు, రెండు పోస్టులు అంధులు, మానసిక వికలాంగులకు, విమ్స్‌లో రెండు పోస్టులు దివ్యాంగులకు కేటాయించినట్లు ఆర్డీ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు.

నేడు కౌన్సెలింగ్

బుధవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. మంగళవారం 100 మందికి చెందిన సర్టిఫికెట్లను పరిశీలించాం. బుధవారం మధ్యాహ్నానికి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. సాయంత్రం నియామక పత్రాలు, పోస్టింగులు ఇస్తాం. ఎవరికైనా వెయిటేజ్ మార్కులు కలవకపోతే తక్షణమే సంప్రదించాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పోస్టులు భర్తీ చేస్తున్నాం. అర్హులందరికీ న్యాయం జరుగుతుంది.

– డాక్టర్ ఉమా సుందరి,
వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్

ఇక లంబసింగి.. లెక్క పక్కా..!

- త్వరలో ఆటోమేటిక్ రెయిన్ గేజ్ స్టేషన్
- వర్షపాతం, ఉష్ణోగ్రతల నమోదుకు వీలు
- ఇన్నాళ్లూ అంచనా వాతావరణ గణాంకాలు
- ఇకపై కచ్చితమైన సమాచారం
- ఏర్పాటుకు ఐఎండీ సన్నాహాలు



లంబసింగి సమీపంలోని చెరువులవేనంలో మంచుతో ఆహ్లాదకర దృశ్యాలు



సాక్షి, విశాఖపట్నం: లంబసింగి.. ఈ పేరు వింటే అందరికీ గుర్తుకొచ్చేది అందమైన, ఎత్తయిన కొండ ప్రాంతం. రాష్ట్రంలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఓ కుగ్రామం. పర్వత శ్రేణుల్లో మంచు సోయగాలతో పర్యాటకులను అమితంగా ఆకర్షించే పర్యాటక ప్రదేశం. ఆంధ్రా కశ్మీరుగా ఖ్యాతి గడించింది. '0'(సున్నా) డిగ్రీల కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతల నమోదుతో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. అందుకే శీతాకాలం వచ్చిందంటే చాలు.. లంబసింగికి టూరిస్టులు క్యూ కడతారు. దేశ, విదేశాల నుంచి వచ్చి వాలతారు. అక్కడ ప్రకృతి అందాలను తనివి తీరా ఆస్వాదిస్తారు. శీతాకాలంలో లంబసింగిలో 'జీరో' డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందట! అంటూ జనం తరచూ విశేషంగా చర్చించుకుంటారు. కానీ ఆ లెక్క పక్కా కాదని ఎంతమందికి తెలుసు? అక్కడ ఉష్ణోగ్రతలను గాని, వర్షపాతాన్ని గాని నమోదు చేసే యంత్రాంగం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో లంబసింగి ఉంది. ఇక్కడికి 19.7 కిలోమీటర్ల దూరంలోని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్ఎస్)లో నమోదయ్యే కనిష్ట ఉష్ణోగ్రతల కంటే లంబసింగిలో రెండు డిగ్రీలు తక్కువగా రికార్డయినట్టు చెబుతున్నారు. ఉదాహరణకు చింతపల్లిలో 2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైతే లంబసింగిలో '0' డిగ్రీలు రికార్డయినట్టు అంచనా వేస్తున్నారు. ఇన్నాళ్లూ దీనినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో లంబసింగిలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఎస్)ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాన్నాళ్లుగా ఉంది. దీనిని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో దీనిపై కొంత కసరత్తు జరిగినా ఆ తర్వాత మరుగున పడింది.



ఏర్పాటు చేయనున్న ఆటోమేటిక్ రెయిన్ గేజ్ స్టేషన్

లంబసింగిలో ఏఆర్‌జీ..

తాజాగా భారత వాతావరణ విభాగం (ఐఎండీ) లంబసింగిలో ఆటోమేటిక్ రెయిన్ గేజ్ (ఏఆర్‌జీ) స్టేషన్‌ను మంజూరు చేసింది. లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమీపంలో దీనిని ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ ఏఆర్‌జీ ఏర్పాటయితే ఆ ప్రాంతంలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలతో పాటు వర్షపాతం, గాలిలో తేమ శాతం రికార్డవుతాయి. దీని నిర్వహణను విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం (సీడబ్ల్యూసీ) చూస్తుంది. మరికొన్నాళ్లలో లంబసింగిలో ఏఆర్‌జీ సిస్టం అందుబాటులోకి వస్తుందని, అప్పటినుంచి అక్కడ కచ్చితమైన వాతావరణ సమాచారం రికార్డవుతుందని సీడబ్ల్యూసీ డైరెక్టర్ సునంద 'సాక్షి'కి చెప్పారు.

సముద్రమట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో..

లంబసింగి తూర్పు కనుమల పర్వత శ్రేణుల్లో ఎత్తయిన ప్రదేశంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. చుట్టూ కాఫీ తోటలు, యూకలిప్టస్ చెట్లతో నిండి ఉంటుంది. సముద్రమట్టానికి అరకు 2,700 అడుగులు, చింతపల్లి 2,800 అడుగుల ఎత్తులోనూ ఉంటే లంబసింగి 3,000 అడుగుల (వెయ్యి మీటర్ల) ఎత్తులో ఉంది. దీంతో లంబసింగి శీతాకాలంలో పొగమంచు దట్టంగా అలముకుని ఆహ్లాదం పంచుతుంది. మంచు ఐస్‌లా గడ్డ కట్టుకుపోతుంది. అంతే కాదు.. అత్యల్ప (0–3 డిగ్రీల) ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రత్యేకతను చాటుకుంటోంది. లంబసింగి అందాలను చూడడానికి వచ్చే పర్యాటకుల కోసం పర్యాటకశాఖ గుడారాలను కూడా ఏర్పాటు చేసింది.

కొర్రబయలు నుంచి లంబసింగి..

లంబసింగికి కొర్రబయలు అనే పేరు కూడా ఉంది. కొర్ర అంటే కర్ర. బయలు అంటే బయట అని అర్థం. ఎవరైనా చలికాలంలో మంచు తీవ్రతకు ఇంటి బయట పడుకుంటే తెల్లారేసరికి కొయ్యలా బిగుసుకుపోతారని, అందుకే కొర్రబయలు పేరు వచ్చిందని చరిత్ర కారులు చెబుతారు.

28న దుకాణాలు, కల్యాణ మండపాల బహిరంగ వేలం

అల్లిపురం(విశాఖ దక్షిణ): జీవీఎంసీ జోన్–4 పరిధిలోని దుకాణాలు, కల్యాణ మండపాలు, క్యాంటీన్లకు ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 31వ వార్డు టీఎస్సార్ వాణిజ్య సముదాయం మొదటి అంతస్తులో 4(ఎస్‌టీ), 5, 6, 7, 10, 11, 14, 12(ఎస్టీ), 16 (డబ్ల్యూఎం), 17(జనరల్), 18 (ఎస్సీ), కింద అంతస్తులో 9, 10, 11, 12(జనరల్), 15 (ఎస్సీ), మొదటి అంతస్తులో 1(ఎస్సీ), 2(ఎస్సీ), 3 నుంచి 7 వరకు, 9 నుంచి 14, 15 (జనరల్), పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులోని బుబాస్ ఫర్నిచర్ వాణిజ్య సముదాయం దుకాణం నంబర్ 2(గ్రౌండ్ ఫ్లోర్), మొదటి అంతస్తు దుకాణం నంబర్లు 5, 6(మూడు షాపులు కలిపి ఒకే షాపు) వేలం వేయనున్నారు. జగదాంబ వాణిజ్య సముదాయంలోని 1 నుంచి 5, 14, 13 (ఎస్టీ), వార్డు నంబర్ 35లో ఓల్డ్ బస్టాండ్ ఫేజ్–2 దుకాణం నంబర్లు 1 నుంచి 6, 8, 10, 11, 13, 14, 15(జనరల్), 7(ఎస్సీ), 9(ఎస్టీ), 12(ఎస్సీ) వార్డు నంబర్ 39లో లక్ష్మీ టాకీస్ దగ్గర పద్మానగర్ వాణిజ్య సముదాయంలో 6, 11, 12(జనరల్), 8 (ఎస్సీ), సూర్యాబాగ్ వాణిజ్య సముదాయంలోని మొదటి అంతస్తు దుకాణం నంబర్ 9, 37వ వార్డులోని రెల్లివీధి వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 1, అంబేడ్కర్ కల్యాణ మండపం, 28వ వార్డులో మీ సేవ బిల్డింగ్(ఆర్కే బీచ్) దుకాణం నంబర్–1, 39వ వార్డులో ఆంగ్లో ఇండియన్ కల్యాణ మండపం, ఏవీఎన్ కాలేజీ షాప్ రూమ్‌లు, 1 నుంచి 4 (స్థానిక ఎస్ఎల్ఎఫ్ గ్రూపు), రామకృష్ణ రైతు బజార్, రెల్లివీధి ఫిష్ మార్కెట్ (రోడ్ సైడ్), ఎస్వీపీ పూర్ణామార్కెట్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని క్యాంటీన్‌కు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు జెడ్సీ వివరించారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు 28న జోన్–4 జోనల్ కార్యాలయంలో జరిగే వేలంపాటలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం పని వేళల్లో జోన్ కార్యాలయ పర్యవేక్షణ అధికారిని సంప్రదించాలని సూచించారు.

నాడు–నేడు పనుల పరిశీలన

సింహాచలం : పాత పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం పీఎంశ్రీ పథకం రాష్ట్ర పరిశీలకురాలు, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటలక్ష్మి సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ద్వారా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పెందుర్తి మండలంలోని పాత పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వెంకటలక్ష్మి సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ప్రత్యేక తరగతులకు హాజరైన పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో పైడపునాయుడు, ప్రధానోపాధ్యాయుడు మూర్తి పాల్గొన్నారు.

భూముల చిక్కు ముడులు విప్పి..

- 22ఏ వివాదాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇప్పటి వరకూ 224 దరఖాస్తులను పరిష్కరించిన అధికారులు
- మొత్తం 332.27 ఎకరాల్ని 22ఏ నుంచి తొలగింపు
- 3,793 మందికి భూ ఇబ్బందుల నుంచి విముక్తి

సాక్షి, విశాఖపట్నం : గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో నిషేధిత జాబితాలోకి వెళ్లిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపిస్తోంది. పాత రికార్డుల్ని పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత నిజమైన లబ్ధిదారులకు వారి భూముల చిక్కుముడులు విప్పుతున్నారు. ఇప్పటి వరకూ 3,793 మంది లబ్ధిదారులకు భూ ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించారు.

2016 నుంచి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయం కారణంగా.. అనేక మంది భూ యజమానులు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూములను అమ్మడానికి వెళ్లినప్పుడు ఈ భూములు రిజిస్ట్రేషన్ కావని, నిషేధిత జాబితాలో ఉన్నాయనే సమాధానం వస్తుండటంతో నానా తంటాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. తమ భూములు కూడా ఇదే సమస్యల్లో ఇరుక్కున్నాయన్న విషయం వందలాది మందికి తెలియని దుస్థితి. నిషేధిత భూముల జాబితాను సెక్షన్ 22ఏ లిస్టు అంటారు. ఎవరి భూమి అయినా ఈ జాబితాలోకి చేరితే ఒక ఆ భూమి రిజిస్ట్రేషన్ జరగదు. ఒక అంచనా ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో 30 – 40 లక్షల ఎకరాల పట్టా భూమి కూడా ఈ జాబితాలో చేరిందని లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ఇంకా చాలా మందికి అసలు తమ భూమి ఈ నిషేధిత జాబితాలో ఉందనే విషయమే తెలియదు. ఎప్పుడో ఒకసారి తెలిసే నాటికి సమస్యను పరిష్కరించుకోవడం మరింత జటిలమవుతుంది.

ఐదు కేటగిరీల్లో సెక్షన్ 22ఏ భూముల జాబితా

22ఏ సెక్షన్ కింద 5 కేటగిరీల్లో భూముల జాబితా ఉంటుంది. కేటగిరి ఏ – ఏదైనా చట్టం గనక ఆ భూమి అన్యాక్రాంతం లేదా బదలాయింపు నిషేధిస్తే ఇటువంటి భూముల రిజిస్ట్రేషన్ చేయకూడదు. అసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం ప్రకారం అసైన్‌మెంట్ భూములను రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదు. ఎల్‌టీఆర్ చట్టం ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరుల పేరు పైకి ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయకూడదు. ల్యాండ్ గ్రాబింగ్, ఆక్రమణల చట్టం ప్రకారం ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేయరాదు. కేటగిరి బీ – ప్రభుత్వ భూములకు సంబంధించిన భూములు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. కేటగిరి సీ కింద దేవదాయ శాఖ, వక్ఫ్ భూములు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. కేటగిరి–డీలో సీలింగ్ మిగులు భూములు, కేటగిరి ఈ పరిధిలోకి ప్రభుత్వం సేకరించే భూములు, కోర్టు అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములు వస్తాయి. ఈ ఐదు కేటగిరీలలో జాబితాలు తయారుచేసి సంబంధిత అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందజేస్తారు. దేవాదయ భూములను దేవాదయ శాఖ, వక్ఫ్ భూములను వక్ఫ్ బోర్డు, మిగతా భూములను రెవెన్యూ అధికారులు జాబితా తయారు చేస్తారు. ఐదో కేటగిరిలోని భూములను మాత్రం ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా జాబితాలో చేరుస్తుంది. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, ఆన్‌లైన్‌లో ఈ జాబితా అందుబాటులో ఉంటుంది. ఈ జాబితాలోని సర్వే నంబరుపై ఏ డాక్యుమెంట్ రాసుకున్నా అది రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. సేల్ డీడ్, దానపత్రం, భాగ పంపకాలు, జీపీఏ తదితర ఏ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కూడా జరగదు. ఒకవేళ పొరపాటున రిజిస్ట్రేషన్ జరిగినా ఆ డాక్యుమెంట్‌పై ఎటువంటి హక్కులు చెల్లవు.



చిక్కుముడులు విప్పుతున్నారు

రెవెన్యూ కార్యాలయాల్లో 22ఏ జాబితా తయారు చేసే సమయంలో జరిగిన పొరపాట్ల వల్ల పట్టా భూములు కూడా ఈ జాబితాలో చేరాయి. వివిధ రకాల కారణాల వల్ల పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలో చేరాయి. ప్రతీ జిల్లా కార్యాలయంలో కొన్ని వందల పిటిషన్లు సెక్షన్ 22ఏ నుంచి తమ భూములు తొలగించాలనే వినతులు వస్తున్నాయి. నిషేధిత జాబితాను మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం.. అసలైన భూ యజమానుల్ని ఇబ్బందులకు గురి చెయ్యకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతూ భూముల చిక్కుముడులు విప్పుతోంది. కలెక్టర్ డా.మల్లికార్జున మార్గదర్శకాల ప్రకారం డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి.. ప్రతి వినతినీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పాత రికార్డులు, ఫిర్యాదుదారు డాక్యుమెంట్లు పరిశీలిస్తూ, 22ఏ సమస్యల్ని తొలగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2021 ఆగస్టు నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో వందల సంఖ్యలో దరఖాస్తులందగా.. ఇప్పటి వరకూ 224 దరఖాస్తుల్ని పరిష్కరించారు. మొత్తం 332.27 ఎకరాల్ని 22ఏ నుంచి తొలగించడంతో 3,793 మందికి భూ ఇబ్బందుల నుంచి విముక్తి లభించింది. ఇదొక నిరంతర ప్రక్రియగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. మల్లికార్జున తెలిపారు.

శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

జిల్లాలోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా భూ యాజమాన్య హక్కుల విషయంలో స్పష్టత లేకపోవడంతో అనేక రకమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. భూ వివాదాల వల్ల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ వేలాదిమంది రైతులకు ఇబ్బందిగా మారిన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. రిటైర్డ్ జిల్లా జడ్జి, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, సర్వే ల్యాండ్ రికార్డు రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో కూడిన ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, సర్వే ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ ఉంటారు. భూములకు సంబంధించిన ఆధారాలు, రికార్డులు, ఎక్స్ సర్వీస్‌మెన్, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితులు, చుక్కల భూములు, మ్యుటేషన్ సెటిల్‌మెంట్ ఆర్డర్లు మొదలైనవన్నింటినీ ఈ కమిటీ పరిశీలించనుంది.

వివాహ ఆహ్వానం



హైదరాబాద్‌లో ఈ నెల 28న జరిగే తన కుమారుడి వివాహానికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కళా ఆస్పత్రి అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ పైడా రమణమూర్తి దంపతులు కోరారు. తాడేపల్లిలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. – మహారాణిపేట(విశాఖ దక్షిణ)

పెద్దలే.. పిల్లలై!



చిన్నారులతో ఆటల్లో పడితే పెద్దవారైనా పిల్లలైపోతారు. సంక్రాంతి సందర్భంగా మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో గాలిపటాలతో చక్కగా అలంకరించారు. చిన్నారులు ఆడుకునేందుకు టాయ్ ట్రైన్ ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు టాయ్ ట్రైన్‌లో ఎక్కి ఆనందిస్తున్నారు. ఓ తల్లి కూడా టాయ్ ట్రైన్‌లో ఎక్కి తాను కూడా పిల్లలతో కలసిపోయి మురిసిపోయింది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మాజీ మంత్రి, తెలుగుదేశం నాయకుడు కొండ్రు మురళి అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తక్షణమే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పోర్టు పెన్షనర్లకు పెరిగిన డీఏ

మురళీనగర్: పోర్టు అండ్ డీఎల్‌బీలో పనిచేస్తున్న క్లాస్‌వన్–1, 2, 3 4 ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కరువు భత్యం పెరిగినట్లు హార్బర్–పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు చెప్పారు. జనవరి–2023 నుంచి మార్చి–2023 వరకు క్లాస్–1, 2లకు 2.4శాతం, క్లాస్–3, 4 ఉద్యోగులకు 3 శాతం కరువు భత్యం పెరిగినట్లు చెప్పారు. పెరిగిన డీఏ జనవరి పింఛన్‌తో అందరికీ చెల్లిస్తారని ఆయన వివరించారు.

మైనర్‌పై లైంగిక దాడి కేసులో పరివర్తన శిక్ష

విశాఖ,లీగల్ : ముక్కు పచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన మైనర్‌కు ఏడాది పాటు పరివర్తన శిక్ష విధిస్తూ నగరంలోని జిల్లా కౌమార బాలల పరివర్తన శిక్షణాలయం కం 2వ అదనపు ప్రధాన మెట్రోపాలటిన్ మేజిస్ట్రేట్ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలివీ.. భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ బాలుడు 2022 అక్టోబర్ సెల్‌ఫోన్ ప్రభావంతో తెలిసి తెలియని వయసులో ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

చిన్నారుల దత్తతకు చక్కని మార్గం

- చట్టప్రకారం ప్రక్రియ
- నిబంధనలు తప్పనిసరి

మాతృత్వం తల్లికి ఓ వరం. ఆ బిడ్డ ఆలనపాలనలో తండ్రి పొందే ఆనందం అనంతం. ఆ సంతోషానికి నోచుకోని తల్లిదండ్రులెందరో.. మరోవైపు ముక్కుపచ్చలారని, కళ్లయినా తెరవని శిశువులను రోడ్డు పక్కన లేదా, రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, చెత్తకుప్పల్లో వదిలేస్తున్న ఉదంతాలెన్నో.. ఒకవైపు బిడ్డలు లేని తల్లిదండ్రులు.. మరోవైపు కన్నప్రేమకు నోచుకోని శిశువులు .. వీరిద్దరికీ ఉభయతారకంగా నిలుస్తున్నాయి ప్రత్యేక దత్తత సంస్థలు. తమ ముద్దుముచ్చట తీర్చుకునేందుకు, ఓ చిన్నారికి బంగారు భవితను అందించేందుకు ముందుకు వచ్చేవారికి ఈ దత్తత ఓ సువర్ణావకాశమే. చట్టప్రకారం జరిగే ఈ ప్రక్రియతో ఎందరో అనాథ బిడ్డలకు చక్కని ఆశ్రయం దొరుకుతోంది. అందుకే అనాథపిల్లల దత్తతను ప్రోత్సహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం కూడా చేస్తున్నాయి. అయితే ఈ దత్తతకు కొన్ని నిబంధనలు తప్పనిసరి.

మద్దిలపాలెం: అనాథ పిల్లలకు ఆశ్రయమిస్తూ.. చట్టప్రకారం చిన్నారులకు దత్తత ఇస్తోంది శిశుగృహ. జీవీఎంసీ 53వ వార్డు ఎఫ్‌సీఐ నగర్‌లో 2005లో ప్రారంభమైంది ఈ ప్రత్యేక దత్తత సంస్థ. అప్పటి నుంచి సుమారు 150 మంది చిన్నారులను వీరు దత్తత ఇచ్చారు. ప్రస్తుతం 8 మంది ఈ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నారు. వారిలో 6 మంది అమ్మాయిలు కాగా ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దత్తత ఇచ్చిన 150 మంది చిన్నారులలో 4గురు చిన్నారులను అమెరికాలో ఉన్నవారికి, స్పెయిన్–1, ఫ్రాన్స్–1, స్వీడన్–1, కెనడా–2, ఇటలీలో ఉన్నవారికి ఒకరిని ఈ కేంద్రం నుంచి దత్తత ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. మిగతా వారిని దేశంలోనే వివిధ ప్రాంతాల్లో దత్తత ఇచ్చామని చెప్పారు. చిన్నారుల సంరక్షణ కోసం కేంద్రంలో ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఆరుగురు ఆయాలు ఉన్నారు. ముగ్గురు ఉదయం, ముగ్గురు రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఒక ఏఎన్ఎం, ఒక చౌకీదార్ ఉన్నారు.

దత్తతకు నిబంధనలు తప్పనిసరి

పిల్లలను దత్తత తీసుకోవాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా కొన్ని నిబంధనలు పాటించాలి. చట్టప్రకారం తీసుకునే దత్తత ప్రక్రియ వల్లే తల్లిదండ్రులను అధికారికంగా నమోదు చేసుకునేందుకు వీలవుతుంది. దత్తత తీసుకున్న ఆ పిల్లల బర్త్ సర్టిఫికెట్ పొందాలన్నా, వారిని స్కూల్లో చేర్పించాలన్నా చట్టపరమైన, న్యాయపరమైన సమస్యలు రాకుండా ఉండాలన్నా తప్పనిసరిగా చట్టప్రకారం నమోదు చేసుకోవాలి.



మద్దిలపాలెం ఎఫ్‌సీఐ నగర్‌లో శిశుగృహ కేంద్రం

చిన్నారుల సంరక్షణ.. రిస్టోరేషన్ : అనాథ పిల్లలు, వదిలేసిన పిల్లల దత్తతకు సంబంధించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఉంది. ఎవరికైనా 0–6 సంవత్సరాల లోపు పిల్లలు దొరికితే చైల్డ్ లైన్ వారు పిల్లలను సంరక్షించి, సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టాలి. ఆ కమిటీ ఫారం17, 18 ఆర్డరు వేసి, ఆ చిన్నారులను శిశుగృహానికు పంపిస్తారు. పిల్లలు వచ్చిన 24 గంటల తర్వాత శిశుగృహ వారు పిల్లల అడ్మిషన్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. మొదట మూడు నెలల్లో పేపర్ ప్రకటన ఇచ్చి, సంబంధీకులు ఎవరైనా వస్తారేమో అని చూస్తారు. మూడు నెలల తర్వాత ఎవరైనా వస్తే వెరిఫై చేసి, వాళ్లకు వారి పిల్లల్ని అప్పచెబుతారు. దాన్నే ఫారం– 44 రిస్టోరేషన్ అంటారు. ఒకవేళ ఎవరూ రాకపోతే మళ్లీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీని శిశుగృహ సిబ్బంది సంప్రదించి రిపోర్ట్ చేస్తారు. పిల్లల తరఫున ఎవరూ రాకపోతే లీగల్లీ ఫ్రీ ఫర్ అడాప్షన్ నోటీస్ పెడతారు.

కలెక్టర్ సమక్షంలో దత్తత

పిల్లలు కావాలి అనుకునే వారు ఆన్‌లైన్‌లో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) వెబ్‌సైట్‌లో రిజర్వు చేసుకుంటారు. అలా రిజర్వ్ చేసుకున్న వారిని.. దత్తత తీసుకోవడం కోసం చూస్తున్న వారిని సంప్రదిస్తారు. అప్పుడు ప్రక్రియ మొదలు పెడతారు. ముందుగా శిశుగృహకు సంబంధించిన అధికారులు, పీడీ, డీసీపీవో, పీవో ఎన్ఐసీ, మేనేజర్ కలిసి ఇంటర్నల్ మీటింగ్ పెట్టుకుని, అనంతరం జిల్లా కలెక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుంటారు. అపాయింట్‌మెంట్ తేదీ ఫిక్స్ అయ్యాక రెండు రోజుల ముందు దత్తత కోసం చూస్తున్న తల్లిదండ్రులను పిలుస్తారు. అప్పుడు వారి వివరాలను సరి చూసుకుని కలెక్టర్ చేతుల మీదుగా పిల్లలను దత్తత ఇస్తారు. తర్వాత శిశుగృహ లాయర్ ద్వారా కోర్టులో అడాప్షన్ ఆర్డర్ తెప్పుకుంటారు. దాన్ని ఉపయోగించుకుని, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు ద్వారా జీవీఎంసీలో జనన ధ్రువీకరణ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తారు. ఈ కోర్టు ఆర్డరు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ కలిసి వారికి కొరియర్ చేస్తారు. దీంతో దత్తత ప్రక్రియ పూర్తవుతుంది.

సానుకూల దృక్పథంతో ఉత్తమ ఫలితాలు

సినీ దర్శకుడు రాఘవేంద్రరావు

గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్టీఎల్) మానసి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన సైన్స్ కౌన్సిల్‌లో ప్రముఖ సినీ దర్శకుడు కె. రాఘవేంద్రావు పాల్గొన్నారు. ఆయన రాకతో ఎన్ఎస్టీఎల్‌లో సందడి నెలకొంది. ఈ సమావేశంలో తొలుత శాస్త్రవేత్త శ్రీనివాస్ నాన్ కాంటాక్ట్ క్రాస్ మీడియం కనెక్షన్ అనే అంశంపై వివరణాత్మక సందేశం అందించారు. అనంతరం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడారు. సానుకూల దృక్పథంతో దేశానికి అత్యుత్తమ ఫలితాలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ని ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు పి.వి.ఎస్ గణేష్ కుమార్, బి.వి.ఎస్.ఎస్ కృష్ణ కుమార్, ఇతర శాస్త్రవేత్తలు, ఎన్ఎస్టీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రేమ ఫెయిలై.. యువకుడి ఆత్మహత్య!



మృతుడు వరుణ్

సింహాచలం: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన పెందుర్తి దరి సుజాతానగర్‌లో చోటుచేసుకుంది. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలివీ.. చినముషిడివాడలోని సావిత్రినగర్‌లో గుడ్ల వరుణ్‌కుమార్‌రెడ్డి(25) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతను నగరంలోని బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గడిచిన కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆ విషయం యువతి ఇంట్లో తెలియడంతో ఆమెకు వేరొకరితో పెళ్లి కుదిర్చి రెండు నెలల కిందట నిశ్చితార్థం చేశారు. అప్పటి నుంచి యువతి వరుణ్‌తో మాట్లాడటం మానేసింది. దీంతో అతను తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అతని తండ్రి విజయ్‌కుమార్‌రెడ్డి పలుచోట్ల వెతికినా అతని జాడ కనిపించలేదు. మంగళవారం ఉదయం వరుణ్‌కుమార్ రెడ్డి స్నేహితుడికి ఫోన్ చేసి తను ఉన్న లొకేషన్ షేర్ చేశాడు. అతను ఆ లొకేషన్‌ను విజయ్‌కుమార్‌రెడ్డికి పంపించాడు. లొకేషన్ ఆధారంగా సుజాతానగర్‌లో కార్మికనగర్ సమీపంలోని వీరానగర్ వెళ్లి చూడగా అక్కడ చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న కొడుకు కనిపించాడు. వెంటనే విషయాన్ని పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలన జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విజయకుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రవితేజకు సంక్రాంతి పురస్కార్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): హైటెక్ గ్రూప్ ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకుని ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు ఒడిశాలోని పర్లాకిమిడిలో పార్ల ఉత్సవ్–2023 ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖకు చెందిన సినీ నటుడు రవితేజ(కళాతృష్ణ)ను నిర్వాహకులు సంక్రాంతి పురస్కార్‌తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైటెక్ చైర్మన్ తిరుపతి పాణిగ్రహి మాట్లాడుతూ ఒడియా, తెలుగు పరిశ్రమల్లో తన కంటూ మంచి పేరును సంపాదించుకున్న రవితేజను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. రవితేజ మాట్లాడుతూ తాను పుట్టిన పర్లాకిమిడిలో బంధువుల సమక్షంలో సన్మానం జరగడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ డైరెక్టర్ రూపేష్ కుమార్ పాణిగ్రహి, సినీ నటులు గౌతమ్ రాజు, చిత్రం శ్రీను, అదుర్స్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రవితేజ

బైక్ ఢీకొని మహిళ దుర్మరణం




వరలక్ష్మి మృతదేహం

కూర్మన్నపాలెం(గాజువాక): అగనంపూడి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చట్టివానిపాలెం ఆర్.హెచ్.సీ కాలనీకి చెందిన పంచదార్ల వరలక్ష్మి(56) మృతి చెందింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చట్టివానిపాలెం ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అగనంపూడి ఆస్పత్రి సమీపంలో సాయిబాబా గుడి వద్ద రోడ్డు దాటుతోంది. అదే సమయంలో అనకాపల్లి నుంచి గాజువాక వైపు వస్తున్న ద్విచక్రవాహనం వరలక్ష్మిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆమెను అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వరలక్ష్మి మృతి చెందింది. ఆమె కుమారుడు సంతోష్ పెయింటర్ పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తులసీరావు సంస్మరణ సభ

- 5 ఎకరాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
- భారీగా హాజరుకానున్న రైతులు, ప్రజాప్రతినిధులు
- 100 మంది పోలీసులతో బందోబస్తు

యలమంచిలి: దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంస్మరణ సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. బుధవారం జరిగే ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో పాడి రైతులు,ప్రజాప్రతినిధులు, తులసీరావు అభిమానులు,పట్టణ ప్రజలు తరలిరానుండడంతో ఆ మేరకు సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. యలమంచిలి పట్టణంలో తులసీరావు స్వగృహం వద్ద ఐదు ఎకరాల ఖాళీ స్థలంలో సభ నిర్వహించనున్నారు. యలమంచిలి పట్టణంలో నలువైపుల నుంచి వచ్చే వాహనాలకు అంతరాయం కలగకుండా సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో 100మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సంతాప సభకు అధిక సంఖ్యలో అభిమానులు, రైతులు తరలివచ్చే అవకాశం ఉండడంతో పట్టణంలోకి భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధించి, ట్రాఫిక్‌ను హైవే మీదుగా మళ్లించారు. సభా ప్రాంగణం వద్దకు వేర్వేరు క్యూలైన్లలో పంపేలా ఏర్పాట్లు చేశారు. అన్ని గ్రామాల నుంచి పాడి రైతులు అధిక సంఖ్యలో తరలిరానున్నట్లు తులసీరావు కుమారుడు,కుమార్తె, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. వంటకాలను తయారు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని తీసుకొచ్చారు. భోజనాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. సంస్మరణ సభకు వచ్చే మంత్రులు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు,జెడ్పీ చైర్మన్లు,జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ప్రత్యేకంగా గ్యాలరీలు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా),ఆడారి వెంకట్, మళ్ల కొండబాబు, ఆడారి పూరి జగన్నాథం, ఆడారి నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్, రమాకుమారి